



పథకాలను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

వికసిత్ భారత్.. వికసిత్ తమిళనాడు

అదే మా లక్ష్యం

- పదేళ్లలో రూ.3లక్షల కోట్లు.. 11 మెడికల్ కాలేజీలు ఇచ్చాం
- తూత్తుకుడి సభలో ప్రధాని నరేంద్రమోదీ
- కొత్త ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ ప్రారంభం
- రూ.4900 కోట్ల ప్రాజెక్టులు జాతికి అంకితం

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అవసరమైన విమానయానం, రహదారులు, నౌకాయానం వంటి ప్రధానమైన మౌలిక సదుపాయాలను కల్పించి వికసిత భారత్‌తో పాటు వికసిత తమిళనాడు సాధనే ఎన్డీయే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శనివారం రాత్రి మాల్దీవుల నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా తూత్తుకుడి చేరుకున్న ప్రధాని.. రూ.4,900 కోట్లతో చేపట్టిన తూత్తుకుడి విమానాశ్రయ నూతన టెర్మినల్, వీఓసీ పోర్ట్ ఉత్తర కార్గో బెర్త్-3 ప్రారంభించి, పలు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితం, కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంయూనిట్ 3, 4 నుంచి విద్యుత్ తరలింపు కోసం ఐఎస్‌టీఎస్ కింద ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల విదేశీ పర్యటన ముగించుకుని భగవాన్ రామేశ్వరుడికి చేరువ ప్రాంతమైన తూత్తుకుడిలో అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరాముడు, తిరుచ్చెందూరు మురుగన్ ఆశీస్సులతో తమిళ ప్రజలకు అభివృద్ధి పథకాలు ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. 2014లో తమిళనాడు అభివృద్ధిలో పరుగులు పెట్టే ప్రణాళికలు రచించామని, వాటి ఫలితమే ఇప్పుడు తూత్తుకుడి విమానాశ్రయ విస్తరణ, పోర్టు విస్తరణ వంటివి జరుగుతున్నాయన్నారు. 4,900 కోట్లతో పోర్ట్, విమానాశ్రయాలు, రోడ్ అభివృద్ధి పథకాలు చేపట్టామని సంతోషం వ్యక్తం చేశారు. గత 16 ఏళ్లలో అంతర్గత మౌలిక సదుపాయాలతో పాటు అనేక పవర్ ప్రాజెక్టులు కూడా చేపట్టామని, ఇది తమిళనాడు, తూత్తుకుడి అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరం పిళ్లై ఆంగ్లేయుల పాలనలో స్వదేశీ పడవను తన సొంత నిధులతో నడిపి, దేశభక్తిని చాటుకున్నారని, ఈ మట్టిపైనే వీరపాండ్య కట్టబ్రహ్మన వంటి పరాక్రమవంతులు జన్మించారని కొనియాడారు. తూత్తుకుడి మేలిమి ముత్యాలకు కూడా పేరు గాంచిందని, గతంలో బిల్‌గేట్స్‌కు తూత్తుకుడి ముత్యాలను కానుకగా ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. ఇంగ్లాండ్‌తో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను మరింత బలోపేతం చేస్తుందని, ఇప్పుడు భారత్ అభివృద్ధిలో ప్రపంచం తన అభివృద్ధిని చూసుకుంటోందన్నారు. ప్రపంచంలోనే అతిగొప్ప 3వ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోందని తెలిపారు. తూత్తుకుడిలో కొత్తగా నిర్మితమైన టెర్మినల్‌తో ఏడాదికి 20 లక్షల మంది ప్రయాణించేలా సదుపాయాలు కల్పించామన్నారు. విమానాశ్రయ విస్తరణతో వ్యాపారాలు పెరిగి, ప్రజల ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. అమృత్ భారత్ పథకం కింద ఇప్పటికే తమిళనాడులో 77 స్టేషన్లను అభివృద్ధి చేశామని, వందేభారత్ పరిచయంతో తమిళనాడు ప్రజలు సరికొత్త అనుభూతి పొందుతారన్నారు. ఇప్పుడు జాతికి అంకితం చేసిన రైల్వే ప్రాజెక్టులతో దక్షిణ తమిళనాడు ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, ఇప్పుడు ఇక్కడ కూడా వందే భారత్ లాంటి ట్రైన్లు నడిపేందుకు మార్గం సుగమమైందని, ఇది తమిళనాడుకు సరికొత్త శక్తిని ఇవ్వబోతోందని తెలిపారు. గత 11 ఏళ్లలో తమిళనాడుకు 11 కొత్త వైద్య కళాశాలలు ఇచ్చామని ప్రధాని వివరించారు.

విస్తరించిన రన్‌వేపై ప్రధాని తొలి అడుగు...

శనివారం రాత్రి 7.35 గంటలకు మాల్దీవుల నుంచి ప్రత్యేక విమానం ద్వారా తూత్తుకుడి చేరుకున్న ప్రధానమంత్రి ప్రత్యేక విమానం తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన నూతన రన్‌వేపై తొలిసారిగా దిగింది. ఆయనకు గవర్నర్ ఆర్‌ఎన్.రవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, సీనియర్ నేతలు తమిళిసై, వానతి శ్రీనివాసన్, పొన్ రాధాకృష్ణన్, హెచ్.రాజా, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు అన్నామలై, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. పథకాల ప్రారంభోత్సవంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, ఎల్.మురుగన్, తూత్తుకుడి ఎంపీ కనిమొళి, రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, టీఆర్‌బీ రాజా, అనితా రాధాకృష్ణన్, గీతా జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదంచెల భద్రత

ప్రధాని పర్యటన నేపథ్యంలో తూత్తుకుడి, తిరుచ్చి జిల్లాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో ఐదంచెల భద్రత కల్పించారు. ఎస్‌పీజీ నేతృత్వంలోని 80 మందితో కూడిన ప్రత్యేక బృందం తూత్తుకుడి, తిరుచ్చి విమానాశ్రయాల చుట్టూ పహారా కాస్తోంది. తమిళనాడు ఏడీజీపీ డేవిడ్‌సన్ దేవాశీర్వాదం, సౌత్ జోన్ ఐజీ ప్రేమానంద్ సిన్హా, తిరునల్వేలి డీఐజీ సంతోష్ హదిమాని నేతృత్వంలో భద్రత ఏర్పాటైంది. మదురై, విరుదునగర్, రామనాథపురం, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్యాకుమారి జిల్లాల నుంచి 2,100 మంది పోలీసులు ప్రధాని పర్యటన బందోబస్తు కోసం వచ్చారు. నావికాదళ భద్రతా డీఐజీ మహేష్ కుమార్ నేతృత్వంలో ఏడీఎస్పీ, డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 75 మంది పోలీసుల చొప్పున రేయింబవళ్లు బోట్లలో సంచరిస్తూ తీరంలో పహారా కాస్తున్నారు. ఆదివారం ఉదయం తిరుచ్చి పరిసరాల్లో డ్రోన్లపై నిషేధించారు. జిల్లా మొత్తం అలర్ట్ ప్రకటించారు. విమానాశ్రయం వుండే ఫోర్‌వే రోడ్డులో భారీ వాహనాల రాకపోకల్ని నిలిపేశారు.

ప్రధాని ప్రారంభించిన పథకాలు

శనివారం రాత్రి తూత్తుకుడి వచ్చిన ప్రధాని రూ.4900 కోట్ల విలువైన పథకాలకు శంకుస్థాపన, ప్రారంభం, జాతికి అంకితం చేశారు. ఇందులో తూత్తుకుడి విమానాశ్రయ నూతన టెర్మినల్ భవనం, తూత్తుకుడి వీఓసీ పోర్ట్ ఉత్తర కార్గో బెర్త్-3ని ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. అదేవిధంగా రూ.285 కోట్లతో వీవో చిదంబరనార్ పోర్ట్ కార్గో నిర్మించారు. దీనివల్ల మునుముందు మరిన్ని ఎగుమతిదిగుమతులకు అవకాశం ఏర్పడనుంది. కూడన్‌కుళం యూనిట్3,4 నుంచి విద్యుత్ తరలింపు కోసం ట్రాన్స్‌మిషన్ వ్యవస్థకు ప్రధాని శంకుస్థాపన చేశారు. వాటితో పపాటు సేతియాతోపు-చోళపురం సెక్షన్ ఫోర్‌వే, తూత్తుకుడి పోర్ట్ రోడ్ సిక్స్‌వే, నాగర్‌కోయిల్‌టౌన్-జంక్షన్-కన్నియాకుమారి రైల్వేలైన్ డబ్లింగ్, ఆరల్వాయ్‌మోజీ-నాగర్‌కోయిల్ జంక్షన్, తిరునల్వేలి-మేలప్పాలియం రైల్వేలైన్ డబ్లింగ్, మదురై-బోడినాయకనూర్ రైల్వేలైన్ విద్యుద్దీకరణ ప్రాజెక్టును ప్రధాని జాతికి అంకితం చేశారు.

ప్రధానితో ఈపీఎస్ భేటీ...

రాత్రి 11 గంటలకు తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న ప్రధానితో అక్కడే అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి భేటీ అయ్యారు. అన్నాడీఎంకే-బీజేపీ మధ్య పొత్తు కుదరకముందు ఏప్రిల్‌లో ఈపీఎస్ ఢిల్లీ వెళ్లినా ప్రధానితో భేటీ కాలేకపోయారు. పొత్తు కుదిరిన తరువాత కూడా ఈ ఇద్దరు నేతల భేటీ కుదరలేదు. దీంతో ఇప్పుడు ఈ ఇద్దరి భేటీపై ఎనలేని ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరినా, రాష్ట్ర నేతల ప్రకటనలతో లేనిపోని వివాదాలు నెలకొంటున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో తిరుచ్చి వచ్చిన ప్రధానితో ఈపీఎస్ భేటీ అయి అన్ని విషయాలను వివరించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో వ్యూహం, కూటమి బలోపేతం వంటి విషయాలపైనా చర్చించినట్లు తెలిసింది. బీజేపీ రాష్ట్ర నేతల వల్ల అన్నాడీఎంకే క్యాడర్‌లో లేనిపోని అనుమానాలు రేగుతున్నాయని, అందువల్ల ప్రభుత్వ ఏర్పాటు వరకూ ఎలాంటి వివాదాస్పద ప్రకటనల జోలికి వెళ్లకుండా నియంత్రించాలని ఈపీఎస్ మోదీకి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈపీఎస్‌తో పాటు సీనియర్ నేత వేలుమణి తదితరులు కూడా ప్రధాని వద్దకు వెళ్లినట్లు తెలిసింది.. కాగా మోదీతో భేటీకి అన్నాడీఎంకే బహిష్కృత నేతలు ఓపీఎస్, టీటీవీ దినకరన్ వంటి వారు ప్రయత్నించినప్పటికీ ప్రధాని కార్యాలయం నుంచి అనుమతి రాలేదని, దీంతో వారు విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలకడంతోనే సరిపుచ్చుకున్నట్లు తెలిసింది.

నేడు రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాలకు...

ఆదివారం ఉదయం 11 గంటలకు మారియట్ హోటల్ నుంచి బయలుదేరే ప్రధాని విమానాశ్రయం వరకు ఓపెన్ జీపులో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆయనకు దారి పొడవునా బీజేపీ-అన్నాడీఎంకే కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. 11.30 గంటలకు తిరుచ్చి నుండి హెలికాప్టర్‌లో అరియలూరు జిల్లా గంగైకొండచోళపురానికి చేరుకుంటారు. అక్కడున్న శివాలయానికి వెళ్లి పూజలు నిర్వహించిన అనంతరం రాజేంద్రచోళుడి జయంత్యుత్సవాల్లో పాల్గొంటారు. ఆ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా నిర్వహించే 'తిరువాసగం' సింఫనీ సంగీత కార్యక్రమాన్ని ప్రధాని వీక్షించనున్నారు. మొత్తం మూడు గంటలపాటు ప్రధాని అక్కడే వుంటారు. ఈ వేడుకలు ముగిసిన అనంతరం ఆయన హెలికాప్టర్‌లో తిరుచ్చికి చేరుకుని, సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రత్యేక విమానం ద్వారా ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించండి

- ప్రధానికి సీఎం లేఖ

అడయార్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా చేపట్టనున్న పథకాలను నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన చెన్నైలోని అపోలో ఆస్పత్రి నుంచి ప్రధానికి ఓ లేఖ రాశారు. ఈ లేఖను శనివారం రాత్రి రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీకి రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి తంగం తెన్నరసు ద్వారా పంపించారు. అనారోగ్యం కారణంగా నగరంలోని ఆస్పత్రిలో స్టాలిన్ చికిత్స పొందుతూ అక్కడ నుంచే తన విధులను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధానికి సీఎం.. లేఖ రాశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటికి నిధులు కేటాయించాలని కోరారు. చాలాకాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో వున్న నిధులను కూడా విడుదల చేయాలని కోరారు. ఇదిలా వుండగా ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం తాను చికిత్స పొందుతున్న ఆస్పత్రిలోనే పలువురు రాష్ట్ర మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ఇందులో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలుతో పాటు పార్టీ సీనియర్ నేతలైన టీఆర్ బాలు, ఎ.రాజా తదితరులు కూడా పాల్గొన్నారు.



ప్రధానికి రాసిన లేఖను కనిమొళితో కలిసి పరిశీలిస్తున్న సీఎం

సైనికుల త్యాగాలు మరువలేనివి: సీఎం ట్వీట్

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైనికుల త్యాగాలు మరువలేనివని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీర్తించారు. కార్గిల్ విజయోత్సవ దినోత్సవం సందర్భంగా శనివారం సీఎం స్టాలిన్ విడుదల చేసిన ప్రకటనలో... కార్గిల్ విజయోత్సవం రోజున, మాతృభూమి కోసం ధైర్యసాహసాలతో పోరాడి, ప్రాణాలు సైతం అర్పించిన సైనిక అమరవీరుల త్యాగం మరువలేనివని సీఎం తెలిపారు.

డీఎంకే వైపే ప్రజానీకం

- అన్నాడీఎంకే-బీజేపీ కూటమికి ఓటమి భయం
- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు డీఎంకేను ఆదరిస్తుండడంతో, అన్నాడీఎంకే-బీజేపీ కూటమికి ఓటమి భయం పట్టుకుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఎద్దేవా చేశారు. చెన్నై పశ్చిమ జిల్లా డీఎంకే యువజన విభాగం నూతన కార్యవర్గం పరిచయ కార్యక్రమం అన్నా అరివాలయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఉదయనిధి మాట్లాడుతూ.. పార్టీ అధినేత స్టాలిన్ ఆరోగ్యంగా ఉన్నారని, మరో మూడు రోజుల్లో ఇంటికి వస్తారని తెలిపారు. ఆయన కోలుకోవడానికి కారణం వైద్యుల చికిత్సతో పాటు ప్రజల ప్రేమాభిమానాలు కూడానని తెలిపారు. ఎమ్మెల్యే, మంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవుల కన్నా డీఎంకే యువజన విభాగం కార్యదర్శి పదవే తనకు ఇష్టమన్నారు. దేశంలోనే ఒక పార్టీకి యువజన విభాగం ప్రారంభించింది మన అధినేత మాత్రమేనన్నారు. అలాంటి యువజన విభాగం 45 ఏళ్ల పూర్తిచేసుకుందన్నారు. డీఎంకే యువజన విభాగం నేతలు ఏం తప్పు చేస్తారా అని ప్రత్యర్థులు ఎదురు చూస్తున్నారని, కానీ వారి ఆశలు ఫలించడం లేదన్నారు. దేశంలో అత్యుత్తమ సేవలందించిన తొలి ఐదుగురు ముఖ్యమంత్రుల్లో తమ పార్టీ అధినేత నిలిచారని, ఈ విషయాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లాల్సిన కర్తవ్యం యువజన విభాగంపై ఉందన్నారు. ప్రజల్లో డీఎంకేకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం.. తమను ఇబ్బంది పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులు నిలిపివేయడంతో పాటు, జాతీయ విద్యా విధానం పేరుతో హిందీ, సంస్కృత భాషల్ని రాష్ట్రంలోకి చొప్పించేందుకు యత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో తమ అధినేత చేపట్టిన కార్యక్రమంలో యువజన విభాగం కార్యకర్తలు చురుగ్గా పాల్గొంటున్నారని, అందువల్లే ప్రస్తుతం 2 కోట్ల మంది డీఎంకే సభ్యులు పేర్లు నమోదుచేసుకున్నారని తెలిపారు. అదే సమయంలో 'తమిళనాడును మీడ్పోం' అంటూ అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి ప్రచారం చేపట్టారంటూ మొదట బీజేపీ నుంచి అన్నాడీఎంకేను రక్షించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఏడో సారి డీఎంకే అధికారం చేపట్టాలన్నా, రెండో సారి పార్టీ అధినేత స్టాలిన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలన్నా, రానున్న 9 నెలలు అవిశ్రాంతంగా శ్రమించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఉదయనిధి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



ప్రసంగిస్తున్న ఉదయనిధి

దేశాన్ని అభివృద్ధి చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం

- వీఐటీ సదస్సులో ఎంపీ డాక్టర్ సుధాన్షు త్రివేది

ప్యారీస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే వికసిత్ భారత్ లక్ష్యమని ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ డాక్టర్ సుధాన్షు త్రివేది పేర్కొన్నారు. కేలంబాక్కం సమీపంలోని వీఐటీ చెన్నై ప్రాంగణంలో 'వికసిత్ భారత్ ' రెండ్రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. ప్రార్థన, జ్యోతిప్రజ్వలన అనంతరం వీఐటీ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ.సెల్వం స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర 20కు పైగా రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థలకు చెందిన 1200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా బీజేపీ ఎంపీ డాక్టర్ సుధాన్షు త్రివేది, విశిష్ట అతిథిగా ఏఐసీటీఈ ఛైర్మెన్ ప్రొఫెసర్ పీజీ సీతారామ్, గౌరవ అతిథిగా ఏబీఆర్‌ఎస్‌ఎం ఆలిండియా జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంతా లక్ష్మణ్, చెన్నై మీనాక్షి మహిళా కళాశాల కార్యదర్శి డాక్టర్ కేఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎంపీ డాక్టర్ సుదాన్షు త్రివేది కీలకోపన్యాసం చేస్తూ ... భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. ఈ జాతీయ సదస్సు ద్వారా కేంద్రప్రభుత్వ ఆకాంక్ష ఏమిటో ప్రజలకు తెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విదేశీ వర్సిటీ నుండి ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న వీఐటీ వర్సిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ.. వేలూరులో 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన వీఐటీ విద్యాసంస్థ నేడు మహావృక్షంగా ఎదిగి 25వేల మందికి పైగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తుందని హర్షం వ్యక్తంచేశారు. వివిధ దేశాలకు చెందిన విద్యాసంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది దేశానికి అందిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తే మన దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏఐసీటీఈ ఛైర్మెన్ ప్రొఫెసర్ పీజీ సీతారామ్ మాట్లాడుతూ... మేక్ ఇన్ ఇండియా, వికసిత్ భారత్ తదితర కేంద్రప్రభుత్వ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ దేశ అభ్యున్నతికై దూరదృష్టితో ప్రవేశపెట్టారన్నారు. చివరగా వీఐటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ పద్మశ్రీ సయ్యద్ హసీబ్‌హసన్, కోవై రత్నం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ మదన్ సెంథిల్, ప్రొఫెసర్ పంచరత్నం, డాక్టర్ త్యాగరాజన్, డాక్టర్ ఆర్.మణికంఠన్ తదితరులు పాల్గొన్న తొలిరోజు కార్యక్రమం తేటా ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.భాస్కర్ వందన సమర్పణతో ముగిసింది.



ఎంపీ సుధాన్షు త్రివేదికి జ్ఞాపిక అందఇస్తున్న వీఐటీ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ తదితరులు

ద్రోహులు ప్రశాంతంగా జీవించ లేరు

- మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి

అడయార్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తల్లిలాంటి అన్నాడీఎంకేకు ద్రోహం చేసిన వారు చరిత్రలో ప్రశాంతంగా జీవించిన దాఖలాలు లేవని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. తన ప్రచార యాత్రలో భాగంగా శనివారం ఉదయం తిరుమయంలో ఆయన ప్రసంగిస్తూ.. తిరుమయం నియోజకవర్గం అన్నాడీఎంకే కంచుకోట అని, ఇక్కడ రెండుసార్లు అతి తక్కువ మెజార్టీతో మన పార్టీ అభ్యర్థి ఓడిపోయారన్నారు. ఈ స్థానం నుంచి గెలిచి మంత్రి పదవిలో ఉన్న రఘుపతి కూడా ఒకపుడు మన పార్టీ నేతే అన్నా రు. తనను ఉన్నత స్థాయికి చేర్చిన అన్నాడీఎంకేకు ద్రోహం చేసిన రఘుపతికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్నాడీఎంకే నుంచి డీఎంకేలో చేరిన ఎనిమిది మంది మంత్రులుగా ఉన్నారన్నా రు.అంటే డీఎంకే నిర్వీర్యమై పోతు ందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. అలాగే, గత ఎన్నికల సమయంలో 5 సవర్ల కంటే తక్కువగా ఉన్న బంగారు రుణాల (సహకార బ్యాంకుల్లో)ను మాఫీ చేస్తామని డీఎంకే హామీ ఇచ్చిందని, ఈ రుణాలు తీసుకున్నవారు మొత్తం 45 లక్షల మందిలో 35 లక్షల మందికే రుణ మాఫీ చేసి చేతులు దులుపుకుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 7.5 శాతం అంతర్గత రిజర్వేషన్లు తీసుకొచ్చింది అన్నాడీఎంకే అని గుర్తు చేశారు. ఇలాంటి మంచి పనుల్లో డీఎంకే ప్రభుత్వం ఒక్కటైనా చేసిందా? అని ప్రశ్నించారు. స్టాలిన్ కేవలం కుటుంబ వృద్ధి, సంక్షేమంపైనే దృష్టిసారిస్తారని, అధికారాన్ని కట్టబెట్టిన ప్రజలను మాత్రం పూర్తిగా విస్మరిస్తారని ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు అన్నాడీఎంకే నేతలు పాల్గొన్నారు.



తిరుమయంలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి

సమాచార దర్శిని

50 పడకలతో 'ఆయుష్' వైద్యశాల

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలో 50 పడకలతో ఆయుష్ వైద్యశాల ఏర్పాటుకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అరుంబాక్కంలోని అరింజర్ అన్నా భారత వైద్యశాల ప్రాంగణంలో రూ.18.15 కోట్లతో ఆయుష్ వైద్యశాల ఏర్పాటుకానుంది. అందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.6.90 కోట్లు కేటాయించగా, జాతీయ ఆయుష్ కమిషన్ రూ.11.25 కోట్లు అందజేయనుందని జీవోలో ప్రభుత్వం తెలిపింది.

పెరుంబాక్కం నుంచి ఎలక్ట్రిక్ బస్సులు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి అనంతరం పెరుంబాక్కం నుంచి 55 ఏసీ సహా 135 ఎలక్ట్రికల్ బస్సులు త్వరలో నడువనున్నట్లు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో పర్యావరణ కాలుష్యం తగ్గించడం, డీజిల్ ఖర్చు ఆదా తదితరాలు పరిగణలోకి తీసుకుని వ్యాసర్పాడి, పెరుంబాక్కం, పూందమల్లి, పల్లవన్ డిపో, తండయార్‌పేట తదితర డిపోల నుంచి 625 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించి, తొలివిడతగా వ్యాసర్పాడి నుంచి 120 బస్సులను గత నెల 30వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారన్నారు. రెండో విడతగా పెరుంబాక్కం డిపో నుంచి పలు ప్రాంతాలకు 55 ఏసీ బస్సులు సహా 135 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నుంగంబాక్కం పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆయా ప్రాంతాల వివరాలు... నుంగంబాక్కం హైరోడ్డు, కృష్ణమ్మ రోడ్డు, ప్రగదాంబాళ్ వీధి, కోడంబాక్కం హైరోడ్డు, వల్లాస్ గార్డన్, రట్‌ల్యాండ్ 1 నుంచి 4 వీధులు, కెథడ్రల్ గార్డన్ రోడ్డు, తిరువీధియాన్ వీధి, మోడల్ స్కూల్ రోడ్డు, అజీజ్ ముల్క్ 1, 5 వీధులు, నుంగంబాక్కం హైరోడ్డు 4వలైన్, అన్నాసాలై, గ్రీమ్స్‌రోడ్డు, మురుగేశన్ నైకర్ కాంప్లెక్స్, జీఎన్ చెట్టి రోడ్డు, హబీబుల్లా రోడ్డు, షఫీ మహ్మద్ రోడ్డు, జైపూర్ నగర్, లాయిడ్స్ రోడ్డు, గణేశ్ వీధి, వెస్ట్ ఎండ్ వీధి, గోపాలపురం ఏరియా, విద్యోదయ రోడ్డు, ప్రకాశం వీధి, జీకే పురం, తిరుమూర్తి నగర్ మెయిన్ రోడ్డు, తిరుమూర్తి నగర్ 1 నుంచి 6 వీధులు, సుందరం అవెన్యూ, జీఏ ఖాన్ వీధి తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

7 మండలాల్లో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 7 నుంచి 13 మండలాల్లో ఈ నెల 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. చెంబరంబాక్కం జలాశయానికి వచ్చే ప్రధాన పైప్ లైన్‌ను మరో పైప్ లైన్‌లో అనుసంధానం చేయనుండడంతో అంబత్తూర్, అన్నానగర్, తేనాంపేట, కోడంబాక్కం, వలసరవాక్కం, ఆలందూర్, అడయార్ మండలాల్లో 30వ తేది ఉదయం 8 నుంచి 1వ తేది రాత్రి 10 గంటల వరకుతాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మూడు రోజులు తాంబరం పరిధిలోని కొన్ని ప్రాంతాలకు కూడా తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు అవసరమైన నీరు నిల్వచేసుకోవాలని చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంజనీరింగ్ కోర్సుల రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ శనివారం నుంచి ఈ నెల 30వ తేది వరకు జరుగనుంది. ఈ కౌన్సెలింగ్‌కు 178.965 నుంచి 143.085 వరకు కటాఫ్ మార్కులు పొందిన విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలను 28వ తేది సాయంత్రం 5 గంటల్లోగా ఎంపిక చేసుకోవాలి. 29వ తేది ఉదయం 10 గంటలకు తాత్కాలిక కేటాయింపు ఉత్తర్వులు అందజేయనుండగా, 30వ తేది సాయంత్రం 5 గంటల్లోపు విద్యార్థులు కళాశాల ఎంపిక ధృవీకరించాలి. 31వ తేది ఉదయం 10 గంటలకు తుది కేటాయింపు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పణ తదితర ప్రక్రియలు పూర్తిచేసి, ఆగస్టు 4వ తేది సాయంత్రం 5 గంటల్లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో చేరాలి. కాగా, మూడో విడత కౌన్సిలింగ్ ఆగస్టు 7న ప్రారంభమై 9వ తేదీతో ముగియనుందని అధికారులు తెలిపారు.

ఐటీఐలో చేరేందుకు భవన నిర్మాణ కార్మికుల వారసులకు ఆహ్వానం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్‌లో కొత్తగా ప్రారంభించిన ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు భవన నిర్మాణ కార్మికుల వారసులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యులైన కార్మికుల వారసులకు మాత్రమే ఈ కోర్సుల్లో అనుమతించనున్నారు. 8,10వ తరగతి ఉత్తీర్ణులైన వారు తగిన సర్టిఫికెట్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా నైపుణ్య శిక్షణా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. వివరాలకు 8778452515, 8248333532 అనే నెంబర్లు సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

తూత్తుకుడి విమానాశ్రయానికి వావూసీ పేరు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి విమానాశ్రయానికి వావూసీ పేరు పెట్టాలని పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ మేరకు షణ్ముగం విడుదల చేసిన ప్రకటనలో... స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంగ్లేయులను ఎదిరించి స్వదేశీ నౌక ద్వారా పొరుగు దేశంలో వర్తకవ్యాపారం జరిపిన తొలి తమిళుడు. తన సొంత ఆస్తులు పేదలకు అందించిన వ్యక్తి వావూ చిదంబరం పిళ్లై తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారంలో జన్మించారని పేర్కొన్నారు. ఆయనకు ఘనత చేకూరేలా తూత్తుకుడి విమానాశ్రయానికి వావూసీ పేరు పెట్టాలని షణ్ముగం లేఖలో ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

30న కావేరి నిర్వహణ మండలి సమావేశం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కావేరి నిర్వహణ మండలి 42వ సమావేశం ఈ నెల 30న ఢిల్లీలో జరుగనుంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరి జలాల వాటా సమస్య పరిష్కరించేలా కావేరి నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమై కావేరి జలాల పంపిణీ వివరాలు తెలుసుకోవడంతో పాటు జలాల విడుదలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలిస్తుంది. ఈ నేపథ్యంలో, కమిటీ 4వ సమావేశం ఈ నెల 30వ తేది ఢిల్లీలో కమిటీ అధ్యక్షుడు ఎస్కే హల్దర్ నేతృత్వంలో జరుగనుంది. ఈ సమావేశంలో పాల్గొనాలని తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులకు వర్తమానం పంపారు. ఈ సమావేశంలో జూలై నెలకు అందించాల్సిన 31.24 టీఎంసీల నీటిని విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వ రాష్ట్రానికి ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర అధికారులు కోరనున్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్ తదితరులు

రూ.43 కోట్లతో కొత్త ఏసీ బస్సుల ప్రారంభం

వేలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోందని జలవనరులశాఖ మంత్రి దురైమురుగన్ పేర్కొన్నారు. వేలూరులో శనివారం ఉదయం రాష్ట్ర నూతన ఏసీ బస్సులను మంత్రి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేలూరులో శనివారం ఏడు ఏసీ బస్సులను ప్రారంభించామన్నారు. అనంతరం అనధికారంగా రాష్ట్రవ్యాప్తంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, బిహార్ వాసుల ఓట్లు ఓటర్ లిస్ట్‌లో ఉన్నాయని సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, పోలీసు యంత్రాంగం ముమ్మరంగా బంగ్లాదేశీయులను పట్టుకునే పనిలో ఉందని, సీఎం స్టాలిన్ కూడా అనధికార ఓట్లకు వ్యతిరేకి అని, త్వరలోనే సర్వే నిర్వహించి దొంగ ఓట్లను తొలగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్ సహా పలుశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టీవీకే స్టిక్కర్లలో బుస్సీ ఆనంద్ ఫొటో తొలగింపు

టి.నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రచార స్టికర్లలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఫొటో తొలగించాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. కుంభకోణంలో పార్టీ శ్రేణులు ఎన్నికల ముందస్తు ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి 'ప్రజలు కోరుకునే మీ ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్' అని పార్టీ నేత విజయ్, ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఫొటోలున్న స్టిక్కర్లను పంపిణీ చేశారు. గత రెండు రోజులుగా కుంభకోణం నగరమంతటా ఈ స్టికర్లను ఇంటి తలుపులపై, గోడలపై అతికించారు. ఈ నేపథ్యంలో ఆ స్టిక్కర్లలోని బుస్సీ ఆనంద్ ఫొటో తొలగించాలని పార్టీ అధిష్టానం నుండి ఆదేశాలు వచ్చాయి. దీంతో పార్టీ స్థానిక నాయకులు బుస్సీ ఆనంద్ ఫొటో లేకుండా విజయ్ ఫొటోతో ఉన్న స్టిక్కర్లను తయారు చేసి శనివారం ఉదయం నుండి నగరమంతటా గతంలో అతికించిన స్టికర్లపై ఈ కొత్త స్టిక్కర్లను అతికించడంలో తలమునకలయ్యారు. ఈ విషయమై తంజావూరు ఈస్ట్ జిల్లా శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ ఆదేశం ప్రకారమే కొత్త స్టిక్కర్లలో విజయ్ ఫొటో మాత్రమే ముద్రించి ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.



కుంభకోణంలో టీవీకే కార్యకర్తలు పంపిణీ చేసిన స్టిక్కర్లు

పనస పండు కోసం చెట్టెక్కిన ఏనుగు

టి.నగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై అడవులకు చేరువగా ఉన్న ముటీస్ ప్రాంతంలో ఓ ఏనుగు తన పిల్లకోసం చెట్టెక్కి పనసపండును తొండంతో తొలగించి గున్న ఏనుగుతో కలిసి పనస తొనలను ఆరగించింది. వాల్పారై చుట్టూ ఉన్న ముటీస్, పన్నిమేడు, పెరియ కల్లార్, యానైముడి, తోనిముడి, గజముడి, ఇంజిపారై, విల్లోని, సేక్కల్‌ముడి తదితర తేయాకు తోటల చుట్టూ ఉన్న దట్టమైన అడవుల్లో అడవి ఏనుగులు పిల్లలతో కలిసి సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ముటీస్ ప్రాంతంలోని తేయాకు తోటలోకి ఓ ఏనుగు గున్నఏనుగుతో కలిసి చొరబడింది. ఆ తోట మధ్యలో ఉన్న పనస చెట్టు కొమ్మనుండి వేలాడుతున్న పెద్ద పనసపండు చూసి పెద్ద ఏనుగు చెట్టుపై ముందరి కాళ్లను ఆనించి, తొండంతో దానిని పెకలించింది. ఆ తర్వాత తన కాలితో పనసపండును పగులగొట్టి, అందులోని పనస తొనలను ఆ రెండు ఏనుగులు ఆరగించాయి. ఈ దృశ్యాన్ని స్థానికులెవరో గమనించి వీడియో తీసి, దానిని సోషల్ మీడియాలో పోస్టు చేయగా, ప్రస్తుతం ఆ ఏనుగుల వీడియో తీవ్రంగా వైరల్ అవుతోంది.



తేయాకుతోటలోని పనసచెట్టుపై కాళ్లు పెట్టి తొండంతో పనసపండును లాగుతున్న ఏనుగు

పాత పింఛన్ విధానాన్నే కొనసాగించాలి

● పింఛనర్ల సంఘం డిమాండ్

వేలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పింఛన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఫోరమ్ ఆఫ్ సివిల్ పింఛనర్స్ అసోసియేషన్ (ఎఫ్‌సీపీఏ)ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. వేలూరు గాంధీ విగ్రహం నుంచి మొదలైన ఈ మానవహారం కాళియమ్మాళ్ ఆలయం వరకు కొనసాగింది. అనంతరం ఎఫ్‌సీపీఏ జిల్లా అధ్యక్షుడు ఎం.పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ, నూతన పింఛన్ బిల్లును వెన్కక్కి తీసుకోవాలని, ఈ కొత్త విధానం వల్ల రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. జిల్లా కార్యదర్శి పి.లోకనాథన్, కోశాధికారి ఎ.కతిర్‌అహ్మద్, తమిళనాడు ఆల్ డిపార్ట్‌మెంట్ పింఛనర్ల సంఘం కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, పి.రవి సహా పలు ప్రభుత్వ పింఛనర్ల సంఘాలు పాల్గొన్నాయి.



నిరసన తెలుపుతున్న ఎఫ్‌సీపీఏ నిర్వాహకులు

అంకాల పరమేశ్వరి ఆలయంలో ఆడి పూజలు

తిరుత్తణి, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీలోని లోయర్ బజార్‌లో కొలువైన అంకాల పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆడి మాసం ఉత్సవాల సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు 108 కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి రాగా, అర్చకులు పవిత్ర జలాలతో అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపెరుమాళ్ సమేత అంకాల పరమేశ్వరి అమ్మవారి తిరుకల్యాణోత్సవం ఘనంగా జరిగింది.



స్వామివార్ల ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న అర్చకుడు

అత్యాచార నిందితుడి ఆచూకీ గుర్తింపు

● అసోం వాసిగా నిర్ధారణ ● ముగిసిన విచారణ

అడయార్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుమ్మిడిపూండి సమీపంలో ఆరంబాక్కంకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో అరెస్టయిన నిందితుడు అసోంకు చెందిన 35 వ్యక్తిని పోలీసులు విచారించారు. ఆ వ్యక్తికి శనివారం వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరుపరిచారు. అంతకుముందు నిందితుడిని ఉంచిన ఆరంబాక్కం పోలీస్ స్టేషన్‌కు స్థానికులు భారీ సంఖ్యలో చేరుకోవడంతో నిందితుడిని కవరైపేట పోలీస్ స్టేషన్‌కు రహస్యంగా తరలించారు. శనివారం గుమ్మిడిపూండి డీఎస్పీ జయశ్రీ, ఊత్తుకోట డీఎస్పీ శాంతి, తిరువళ్లూరు డీఎస్పీ తమిళరసి, తిరుత్తణి డీఎస్పీ కందస్వామి నిందితుడిని విచారించారు. నిందితుడిని వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి సమక్షంలో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి సూళ్ళూరుపేటలోని ఓ డాబా యజమానిని కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసారు. ఇదిలావుంటే, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానికులు ఆరంబాక్కం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడుని అసోం రాష్ట్రానికి చెందిన రాజు బిశ్వకర్మ(35)గా గుర్తించారు. ఏపీలోని తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటలో రోడ్డు పక్కన ఉండే డాబా హోటల్‌లో పనిచేస్తున్నట్టుగా గుర్తించినట్టు ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 12వ తేదీ జరిగిన ఈ అత్యాచార కేసులో నిందితుడిని గుర్తించేందుకు నార్త్ జోన్ ఐజీ అస్రా కార్గ్ సారథ్యంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా, ఈ బృందం నిందితుడిని సూళ్ళూరుపేట రైల్వే స్టేషన్‌లో గుర్తించి అరెస్టు చేసినట్టు వెల్లడించింది.

ఎన్నికల సమయంలో ప్రధాని పర్యటన ఆనవాయితీ

● మంత్రి ఏవీ వేలు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న ప్రతి సారి ప్రధానమంత్రి రాష్ట్రంలో పర్యటించడం ఆనవాయితీగా మారిందని మంత్రి ఏవీ వేలు ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ద్రావిడ మోడల్ పాలనను ప్రజలు ఆదరిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయన్నారు. తాజాగా, అసెంబ్లీ ఎన్నికల కోసం అన్నాడీఎంకే-బీజేపీ కూటమిగా ఏర్పాడ్డాయన్నారు. రాష్ట్రంలో ఎలాగైనా కాలుమోపాలనే బీజేపీ ఎత్తుగడలను రాష్ట్ర ప్రజలు అంగీకరించలేరన్నారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయని ప్రధాని, ఎన్నికల సమయంలో మాత్రం రాష్ట్రంలో పర్యటించడం ఆనవాయితీగా మారిందని మంత్రి తెలిపారు.

గత ఏడాది 1,796 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా గత ఏడాది (2024) 13,476 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించగా, తమిళనాడులోనే 1,796 చికిత్సలు నిర్వహించారు. ఈ మేరకు పార్లమెంటులో కేంద్ర ఆరోగ్యశాఖ వెలువరించిన వివరాల మేరకు... దేశంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన రాష్ట్రాల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. 2,490 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలతో ఢిల్లీ ప్రథమస్థానంలో నిలిచింది. కాగా, నామక్కల్ జిల్లాలో నిబంధనలు అతిక్రమించి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారనే ఫిర్యాదు చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల వివరాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

వేతనాల పెంచాలని ఉపాధ్యాయుల నిరసన

వేలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలోని సత్తువాచారిలోని కలెక్టర్ కార్యాలయం వద్ద వేతనాలు పెంచాలంటూ ఇంటర్మీడియట్ రిజిస్టర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్ఞానశేఖరన్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో ఆయన మాట్లాడుతూ, 2009లో నియమితులైన తమకు గత 15యేళ్లుగా అదే జీతం ఇస్తున్నారని, కొత్తగా ఉద్యోగాల్లో చేరిన జూనియర్ ఉపాధ్యాయులకు, తమకు ఒకే విధమైన జీతాన్ని ఇస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు జీతాలను పెంచాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలూరు జిల్లా అధ్యక్షుడు విజయన్, తిరుపత్తూరు జిల్లా అధ్యక్షుడు మథియలగన్, రాణిపేట జిల్లా అధ్యక్షుడు దురై సహా పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ సంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.

184 అడుగుల మురుగన్ విగ్రహ నిర్మాణం నిలిపివేయాలి

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ మరుదుమలైలో 184 అడుగుల ఎత్తైన మురుగన్ విగ్రహ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ వన్యప్రాణుల కార్యకర్త మురళీధరన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. నీలగిరి నుంచి ఇతర అటవీ ప్రాంతాలకు వెళ్లేందుకు ఏనుగులు ఈ ప్రాంతాన్ని మార్గంగా ఉపయోగించుకుంటున్నాయని, అలాగే, మురుగన్ విగ్రహ నిర్మాణాలతో కలిగే పర్యావరణ ప్రభావంపై అంచనా వేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, ఈ వ్యవహారంపై అఫిడవిట్ దాఖలుచేయాలని అటవీ శాఖకు నోటీసు జారీచేసింది.

ఆవడి ఏసీపీగా ఫెరోజ్‌ఖాన్ బాధ్యతల స్వీకరణ



ఫెరోజ్‌ఖాన్ అబ్దుల్లా

టినగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆవడి అసిస్టెంట్ పోలీసు కమిషనర్‌గా ఫెరోజ్‌ఖాన్ అబ్దుల్లా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆవడి పోలీసు కమిషనరేట్‌లో ఆవడి, రెడ్‌హిల్స్ ప్రాంతాలకు ఇద్దరు ఏసీపీలున్నారు. వీరిలో ఆవడి ఏసీపీగా పనిచేసిన అయ్‌మన్ జమాల్ గత వారం రాణిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కరూరు జిల్లా ఎస్పీ ఫెరోజ్‌ఖాన్ అబ్దుల్లాను ఆవడికి బదిలీ చేశారు. శుక్రవారం ఉదయం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి ఆవడి పోలీసు కమిషనర్ శంకర్, అడిషనల్ కమిషనర్ భవానీశ్వరిని కలుసుకున్నారు.

హామీలు నెరవేర్చాలంటూ పార్ట్‌టైమ్ టీచర్ల నిరాహారదీక్ష



నిరాహారదీక్షలో పాల్గొన్న పార్ట్‌టైమ్ టీచర్లు

ప్యారీస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో శనివారం పార్ట్‌టైమ్ టీచర్లు నిరాహారదీక్ష చేశారు. ఎగ్మూర్ రాజరత్నం స్టేడియంలో నిర్వహించిన ఆందోళనలో టీచర్లు పెద్దసంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. గత ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టోలో ఉన్న హామీల్లో తమకు సంబంధించిన హామీని నెరవేర్చని పక్షంలో సెప్టెంబర్‌లో విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● గూండా చట్టం కింద టీచర్ అరెస్ట్

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని పోలీసులు గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన సెందిల్‌కుమార్ (50) 23 ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పలు పాఠశాలల్లో పనిచేస్తూ, గత ఏడాది జూన్‌లో ఊటీ సమీపంలోని ఓ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో, కొద్ది రోజుల క్రితం ఆ పాఠశాలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అధికారులు, పోలీసులు వెళ్లారు. అధికారులు 'గుడ్ టచ్...బాడ్ టచ్' గురించి విద్యార్థులకు తెలుపుతున్న సమయంలో, 6వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలిక, టీచర్ సెందిల్ కుమార్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదుతో దిగ్భ్రాంతి చెందిన అధికారులు, ఈ వ్యవహారంపై విచారణ జరపగా, సెందిల్‌కుమార్ 21 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలింది. అధికారుల ఫిర్యాదుతో ఊటీ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి సెందిల్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో, సెందిల్‌కుమార్‌ను గూండా చట్టం కింద అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని ఎస్పీ నిషా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. దాని ఆధారంగా సెందిల్‌కుమార్‌ను గూండా చట్టం కింద అరెస్ట్ చేసేందుకు జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య ఉత్తర్వులు జారీచేశారు.

దత్తపుత్రికపై లైంగిక వేధింపులు

● ఒకరి అరెస్ట్

వేలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దత్తతకు తీసుకున్న బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన 55 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపత్తూరు జిల్లా వానియంబాడిలోని ఓ ప్రాంతంలో నివసించే భవన నిర్మాణ కార్మికుడి దంపతులకు పిల్లలు లేకపోవడంతో అతడి భార్య కొన్నేళ్ల క్రితం 13యేళ్ల బాలికను దత్తత తీసుకుంది. గత ఏడాది అతడి భార్య అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాలిక బాగోగులు కార్మికుడు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో పెంపుడు కూతురిపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. గత కొన్ని రోజులుగా బాలిక ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఇరుగుపొరుగువారు చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, బాలిక జరిగిన విషయాన్ని వారితో చెప్పింది. దీంతో వానియంబాడి మహిళా పోలీసులకు తెలపగా, విచారణ జరిపిన పోలీసులు ఆ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు అతడిని జైలుకు తరలించారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో బాలుడి సహా ఇద్దరి అరెస్ట్

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలపేటలో సెల్‌ఫోన్ చోరీ కేసులో బాలుడి సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాడ్‌వేకు చెందిన హరీస్ (18) గురువారం ఉదయం స్నేహితులతో కలసి బ్రాడ్‌వే థియేటర్ సమీపంలో వాకింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో వారి వెనుకగా బైక్‌పై వచ్చిన ఇద్దరు హరీస్ చేతిలోని ఐఫోన్ లాక్కొని పరారయ్యారు. హరీస్ ఫిర్యాదుతో విచారణ చేపట్టిన ముత్యాలపేట పోలీసులు, మూలకొత్తలంకు చెందిన సిలంబరసన్ (23) సహా 17 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేశారు.

బాణసంచా దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

● రూ. లక్షల్లో ఆస్తినష్టం

టినగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులోని బాణసంచా దుకాణంలో శనివారం వేకువజాము సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో దాదాపు రూ. 30లక్షల విలువైన టపాసులు, ప్లాస్టిక్ సామగ్రి, ఫర్నిచర్ కాలిబూడిదయ్యాయి. తిరుప్పూరు కొంగు మెయిన్‌రోడ్డులో తూత్తుకుడికి చెందిన మురుగేశన్ బాణసంచా, ప్లాస్టిక్ వస్తువుల దుకాణం నడుపుతున్నారు. రెండువారాల క్రితం లక్షలాది రూపాయల విలువచేసే బాణసంచా, ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేసి దుకాణంలో అమర్చారు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజాము ఆ దుకాణం నుండి దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. అది చూసి స్థానికులు దిగ్భ్రాంతి వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే తిరుప్పూరు వెస్ట్ అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలను ఆర్పడానికి తీవ్రంగా పోరాడారు. ఆ దుకాణానికి పక్కనే ఉన్న భవనాలకు మంటలు వ్యాపించకుండా చేశారు. తిరుప్పూరు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా తేంగాపట్టణం ప్రాంతానికి చెందిన అఫ్జల్ (17), అజ్మల్ (16), నాసిల్ (15), అజిత్)((17)లు కుళిత్తురైలో జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు శుక్రవారం ఒకే బైక్‌లో బయల్దేరారు. అఫ్జల్ నడుపుతున్న బైక్, కల్లుతొట్టి ప్రాంతంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ఆ వేగానికి నలుగురు బైక్ నుంచి ఎగిరిపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని చుట్టుపక్కల వారు అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక అఫ్జల్, అజిత్ మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.



మృతులు అఫ్జల్, అజిత్ (ఫైల్‌ఫొటో)

మేకపిల్లను మింగేందుకు కొండ చిలువ యత్నం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మేకపిల్లను కొండ చిలువ మింగబోతుండడం గమనించిన స్థానికులు ఆ మేకపిల్లను రక్షించారు. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం సమీపంలోని మూలత్తురై గ్రామ శివారులోని భవాని నదీతీరంలో రైతులు మేకలు, గొర్రెలను పెంచుతుంటారు. ఘటన జరిగిన రోజున సమీపంలోని పొలానికి మేత కోసం వెళ్లిన 6 నెలల మేక పిల్లను కొండ చిలువ బంధించి, మింగేందుకు యత్నించింది. ఆ సమయంలో ఆ ప్రాంతానికి వచ్చిన స్థానికులు సమయస్ఫూర్తిగా కొండ చిలువ నుంచి మేక పిల్లను రక్షించారు. అనంతరం కొండ చిలువ సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోయింది. కాగా, కొండ చిలువ మేకపిల్ల మింగబోయే, విడిచిపెట్టే దృశ్యాలను కొందరు యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.



పళ్లిపట్టు జోనల్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభం



విజేతలకు మెడల్స్ బహూకరిస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అతిమాంజేరిపేటలోని కీచ్చాళం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జోనల్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 400లకు పైగా పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పళ్లిపట్టు, ఆర్కే.పేట, తిరుత్తణి, తిరువలంగాడు తదితర మండలాల్లోని పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలను తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాయామ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరపెరుమాళ్, జిల్లా అధ్యక్షుడు గణేశన్‌తో కలిసి ఎమ్మెల్యే చంద్రన్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్‌కుమార్, పీఈటీ వెంకట నరసింహరాజు, డీఎంకే మండల కార్యదర్శి జి.రవీంద్ర, జంగాలపల్లె గోపి, గవాస్కర్, శివానందం, మాజీ పంచాయతీ సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇదేమిటి 'నీరు పల్లమెరుగు...నిజం దేవుడెరుగు' అనే అందమైన తెలుగు సామెతను తిరగరాశారని అనుకుంటున్నారా?.. సుప్రసిద్ధ శైవక్షేత్రం చిదంబరం నటరాజస్వామివారి ఆలయం వద్ద ప్రాచీనులు తవ్విన వాననీటి కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తే తెలుగు సామెతను తిరగరాసి చదువుకోవటం సమంజసమేననే భావన కలుగుతుంది. ఈ కాలువ ఆలయంలోని పల్లపు ప్రాంతంలో ప్రారంభమై, మిట్ట ప్రాంతంలో కొలను వద్ద ముగుస్తుంది. చోళులు నీటిని అత్యంత పవిత్రంగా భావించేవారు. ఆ నీటిని నిల్వ చేయడమే కాకుండా, పల్లపు ప్రాంతం నుండి మిట్ట ప్రాంతానికి నీటిని ప్రవహింపజేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా కలిగి ఉండేవారు. ఆ విషయాన్నే లోకానికి ఎలుగెత్తి చాటేలా చిదంబరం నటరాజస్వామి ఆలయం దిగువ (పల్లపు ప్రాంతం) నుండి మిట్ట ప్రాంతానికి నీటిని ప్రవహింపజేసే కాలువే 'చిదంబర రహస్యం' అని చారిత్రక పరిశోధకులు చెబుతున్నారు. ఆ నీటి మార్గం రహస్యం గురించిన వివరాలు కూడా ఆసక్తిదాయకం.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

SUNDAY SPECIAL



ఆలయ కొలను

'నీరు మిట్టనెరుగు... నిజం దేవుడెరుగు'



ఆలయం వద్దనున్న శివప్రియ కొలను



కాలువలో చెత్త చేరకుండా ఇనుప కమ్మీలతో నిర్మించిన అడ్డుకట్ట

● ఇదేనా చిదంబర రహస్యం?

అసలు పేరు 'థిల్లై'

మొదటి కులోత్తుంగ చోళుడు, విక్రమచోళుడి కాలంలో సైన్యాధ్యక్షుడిగా పనిచేసిన నరలోక వీరుడే చిదంబరం నగర స్థాపకుడని చరిత్రకారులు చెబుతారు. గుణమేనక్కైపురం, పెరుంబట్ర పులియూరు అనే ప్రాంతాలు కలిసి, అతడి హయాంలోనే నగరంగా మారింది. ఆ నగరానికి 'థిల్లై' అంటూ శివుడికి ప్రీతికరమైన పేరుపెట్టారు. కాలగమనంలో ఆ నగరం పేరు చిదంబరంగా మారింది. 11, 13 శతాబ్దాల నడుమ ఆ ప్రాంతంలో నివసించిన ప్రజలు కూడా నీటి నిర్వహణపై చక్కటి అవగాహన కలిగి ఉండేవారు. అందుకే ప్రతివీధి మధ్యలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేసుకున్నారు. ఇక చిదంబరం ఆలయం వద్దనున్న ఈ వాననీటి కాల్వను పరిశీలిస్తే 9వ శతాబ్దానికి ముందు నిర్మించిన ఆ కాలువ లోపల భాగం ఇంకా పరిశుభ్రంగా ఉండటం నేటి ఇంజనీర్లకు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాలువ పైభాగం నల్ల కంకరరాళ్లతో ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌తో నిర్మించారు. అందువల్లే భూమి ఉపరితలంపై జలాలు వరదలా కట్టలు తెంచుకుని ప్రవహించినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా అవి కాలువ లోపలి భాగాన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయని పద్ధతిలో నిర్మించారు.



ఆలయం దిగువభాగాన ఉన్న వాననీటి కాలువ

అద్భుతమైన నీటి నిర్వహణ...

తంజావూరు కుందవై నాచ్చియార్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల చారిత్రక విభాగం ప్రొఫెసర్ శివరామ కృష్ణన్, మైలాడుదురై మనల్‌మేడులోని ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలకు చెందిన చారిత్రక విభాగాధిపతి కళై సెల్వన్, ఉళుందూరుపేటకు చెందిన చారిత్రక పరిశోధకుడు లలిత్‌కుమార్ తదితరులు ఆ చిదంబర రహస్యం (ఆ కాలువ) వివరాలను బహిర్గతం చేశారు. కడలూరు జిల్లా చిదంబరంలో ఉన్న నటరాజస్వామి వారి ఆలయం చోళ రాజుల పూర్వీకులది. అందుకే వారు ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి మరింత మెరుగులతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా మొదటి రాజేంద్రుడు, రెండవ రాజేంద్రుడు, విక్రమచోళుడు, మొదటి కుళోత్తుంగుడు ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను నిర్వహించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆ పనులలో అత్యంత ముఖ్యమైనది అద్భుతమైన నీటి నిర్వహణ నిర్మాణం అని చెప్పవచ్చు. 51 ఎకరాల విస్తీర్ణం కలిగిన చిదంబరం నటరాజ ఆలయ అంతర ప్రాకారంలో కురిసే వర్షపు నీరంతా ఆ ఆలయం ఉత్తరం వైపున్న యానైక్కాల్ మండపం (ఏనుగు పాదం మండపం) వద్ద ప్రారంభమయ్యే కాలువగుండా ప్రవహిస్తుంది. ఈ కాలువను తిరుప్పార్కడల్, థిల్లై కాళికోవిల్ ముందున్న శివప్రియ కొలనుకు అనుసంధానిస్తూ నిర్మించారు. ఆ కాలువకు కమ్మీల తలుపులు అమర్చి ప్రాచీన కాలం నుంచే సంరక్షిస్తున్నారు. కాలువ మొత్తం పొడవు 2,200 మీటర్లు. 65 సెం.మీల వెడల్పు, 77 సెం.మీల లోతు ఉంది. దీనికోసం (ఈ అంకెలు ఇంగ్లీష్‌లో ఉన్నాయి) 24 x15x 5 సెం.మీ. పరిమాణంలో ఇటుకలను ఉపయోగించారు. పైభాగాన్ని ఇటుకలతో పూర్తిగా మూసివేశారు. ఈ కాలువలో అక్కడక్కడా పైభాగాల్లో దీర్ఘచతురస్రాకారంలోని నల్లరాతి పలకలతో కప్పి ఉంచారు. ఆ కాలువలో ఏవైనా చెత్తాచెదారం పేరుకుపోతే వాటిని తొలగించడానికి ఈ నల్లరాతి పలకలను తొలగించి పూడిక తీసేవారు. ఈ భూగర్భ కాలువ ద్వారా చిదంబరం నటరాజస్వామివారి ఆలయంపై పడే వర్షపునీరంతా రెండు కొలనుల్లోకి చేరుతుండటం విశేషం. ఈ కాలువ ప్రారంభంలో 30 సెం.మీల లోతు, శివప్రియ కొలను ప్రాంతం వద్ద 200 సెం.మీ. లోతు ఉంటుంది. దీని వల్ల వర్షపు నీరంతా నేరుగా శివప్రియ కొలను ప్రాంతానికి వేగంగా చేరుతుంది. ఈ కాలువ నిర్మాణ సాంకేతికత పరిజ్ఞానం కాలం 11-12 వ శతాబ్దం నాటిది.



వెలుపల ప్రాకారంలో ఇటుకలతో మూసివున్న కాలువ పైభాగం

వాననీటి సేకరణ...

భూగర్భ జలాలను కాపాడుకోవటంలో చోళరాజులు ప్రదర్శించిన అపారమైన శ్రద్ధకు ఈ కాలువ నిర్మాణం నిదర్శనమని చరిత్రకారులు చెబుతున్నారు. సముద్రతీర ప్రాంత నగరమైన చిదంబరం భూగర్భ జలాలను సంరక్షించడానికి వాననీటి సేకరణే చక్కటి ఉపాయమని పూర్వీకులు భావించారు. ఈ విషయంపై అవగాహన కలిగి ఉండటం వల్లే చోళరాజులు చిదంబరం ఆలయం చుట్టూ తొమ్మిది నీటి కొలనులను నిర్మించారు. వీటిని సక్రమంగా సంరక్షించకపోవడం వల్లే నేడు భూగర్భజలాలు కాస్తా లవణ జలాలు (ఉప్పునీరు)గా మారాయి. వర్షాకాలంలో చిదంబరం పడమటి ప్రాంతంలో కురిసే వర్షపుజలాల వల్ల ఆ నగరంలో తరచూ వరదలు సంభవించేవి. ఆ విషయాన్ని గమనించిన ప్రానందక చోళుడు చిదంబరానికి పడమటి వైపు వీరనారాయణ పెద్దచెరువు తవ్వించాడు. ఆ చెరువులో అత్యధికంగా వర్షపునీటిని నిల్వ చేయడం వల్ల ఎంత వర్షం కురిసినా ప్రజలు నటరాజస్వామివారి ఆలయానికి వచ్చి దర్శించేవారు. అలాగే యేడాదికి రెండు టీఎంసీల జలాలు కడలిలో కలిసిపోకుండా అడ్డుకోగలిగారు. ఈ కారణంగానే ఆ ప్రాంతం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించింది.

పల్లపు ప్రాంతం నుంచి పైకినీరు....

ఈ కాలువ నిర్మాణాన్ని పరిశీలిసే నీరు మిట్టనెరుగు అని సామెత మార్చాల్సి ఉంటుంది. జలాలు ఎల్లప్పుడూ పల్లం ప్రాంతం వైపే ప్రవహిస్తాయి. అయితే చిదంబరం ఆలయం వద్ద నిర్మించిన కాలువలో ఎల్లప్పుడూ జలాలు పల్లపు ప్రాంతం నుండి మిట్ట ప్రాంతానికి అత్యంత వేగంగా ప్రవహిస్తుంటాయి.

ఆలయ ఉత్తరగోపురం దిగువభాగంలో ఈ వాన నీటి కాలువ ద్వారా వర్షపునీరు దక్షిణ దిశ నుండి ఉత్తర దిశగా ప్రవహింపజేశారు. ఈ కాలువ ప్రతి వీధి మూలలోనూ లోతుగా వెడల్పుగా ఉండేలా పెద్ద చతురస్రాకారం కలిగిన గోయి నిర్మించారు. ఆ గోతి నుండి జలాలు కాలువ ద్వారా ప్రవహించేలా చేశారు. ఈ కాలువను కొన్ని చోట్ల వెడల్పుగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా నిర్మించారు. కాలువ మార్గాల్లో అక్కడక్కడ గోయి తవ్వడం వల్ల అందులో పడిన నీటి పీడనం కారణంగా కాలువలో నీరు వేగంగా అది మిట్ట ప్రాంతమైనా సరే సులువుగా ప్రవహిస్తుంది. ఈ కాలువ నిర్మాణానికి ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని గమనిస్తే చోళరాజులు చుక్కనీటిని కూడా వృథా చేసేవారు కాదని స్పష్టమవుతుంది. తమిళులు నివసించే భౌగోళిక ప్రాంతంలో నీటిని పడమర నుండి తూర్పుకు, ఉత్తరం నుండి దక్షిణానికి మాత్రమే ప్రవహింపచేయగల పరిస్థితిని పూర్తిగా మార్చేశారు. నాలుగు దిక్కులా నీటిని సులభతరంగా వేగంగా ప్రవహింపజేయగల సాంకేతిక సత్తా వీరిలో ఉండేదనటానికి వీరాణం చెరువే ప్రత్యక్ష సాక్ష్యం. 1100 సంవత్సరాలకు పూర్వం వీరాణం చెరువు తవ్వకాలు జరిగాయి. ఆ తర్వాత కొల్లిడం వాగు నుంచి తవ్విన పడమటి కాలువ ద్వారా వీరాణం చెరువుకు అనుసంధానం చేశారు. సుమారు టీఎంసీ జలాలను నిల్వ చేశారు. దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశగా నీటిని సరఫరా చేయడం జలశాస్త్ర నియమాలకు విరుద్ధం అయినప్పటికీ వీరాణం చెరువు నేటికీ ప్రజల దాహార్తిని తీర్చి, సాగునీరందించటమే కాకుండా రాజధాని నగరం చెన్నై వాసుల దాహార్తిని తీర్చుతోంది. ఈ వీరాణం చెరువు నిర్మాణం కూడా నేటి శాస్త్రవేత్తలకు పరిశోధనాత్మక అంశమని చెప్పటం అతిశయోక్తి కాదు.



కాలువ మార్గంలో చతురస్రాకారపు గొయ్యి

పనియమ మాత ఉత్సవాలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి పనియమ మాత మందిర ఉత్సవాలు శనివారం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. తూత్తుకుడి జిల్లాలోని పనియమ మాత మందిరం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. ఈ చర్చి రోమ్ నగరంలో ఉన్న వాటికన్ సిటీ ద్వారా బాసలిక హోదా పొందింది. చర్చిలో ప్రతి ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 5వ తేది వరకు 10 రోజులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ ప్రకారం, ఈ ఏడాది 443వ వార్షికోత్సవాలు పతాకావిష్కరణతో శనివారం ప్రారంభమయ్యాయి. తూత్తుకుడి బిషప్ స్టీఫెన్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉదయం 8.45 గంటలకు పనిమయ మాత చిత్రంతో కూడిన పతాకాన్ని చర్చి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్తంభంపై ఎగురవేశారు. పతాకావిష్కరణ సమయంలో సముద్రతీరంలో నిలిపిన పడవల నుంచి సైరన్ మోగించారు. కార్యక్రమంలో మంత్రి గీతాజీవన్, జిల్లా కలెక్టర్ ఇళంభగవత్, ఎస్పీ ఆల్బర్ట్ జాన్ సహా భక్తులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా ఇద్దరు ఏడీఎస్పీలు, ఏఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 35 మంది ఎస్ఐలు సహా వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



అనారోగ్యం కారణంగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ డీఎంకే సీనియర్ నేతలతో కలిసి చర్చిస్తున్న దృశ్యం

ప్రపంచ శాంతి కోసం సామూహిక గాయత్రీ మంత్ర జపం

ప్యారీస్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సామూహిక గాయత్రీ మంత్ర జప కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి చెన్నై విభాగం కో-ఆర్డినేటర్ పోరూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కె.సి.దాస్ స్మారక సేవా సంస్థకు ఆధ్యాత్మిక అనుబంధ సంస్థ అయిన సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి ఆధ్వర్యంలో అయోధ్యలో "శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం" ఘనంగా జరిగిందన్నారు. ఈ సందర్భంగా లోకకల్యాణార్థం అక్షరకోటి గాయత్రీ జపయజ్ఞంలో భాగంగా సామూహిక గాయత్రీ మంత్రజప కార్యక్రమం చేపట్టాలని కె.సి.దాస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి పిలుపు మేరకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మంత్ర జపం చేయనున్నట్లు ఆయన తెలిపారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి నాజర్ తదితరులు

తిరువళ్లూరు-ఆవడి కొత్త బస్సులు ప్రారంభం

తిరుత్తణి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు-ఆవడి కొత్త ఏసీ బస్సులను మైనారిటీ శాఖ మంత్రి ఎస్ఎం.నాజర్ శనివారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంలో భాగంగా తిరువళ్లూరు-ఆవడికు నూతన ఏసీ బస్సులు ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వంలో ఇప్పటివరకు 224 నూతన బస్సులను ప్రారంభించి, పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిందన్నారు. అదే విధంగా జిల్లాలోని సుమారు 152 గ్రామీణ ప్రాంతాలకు ఈ బస్సు సర్వీసులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం పచ్చజెండా ఊపి నూతన బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, దురైచంద్రశేఖర్, డీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండో-పాక్ ఐక్యతను చాటి చెప్పేలా

'రాయల్ సెల్యూట్'

● దర్శకుడు జై శివ శేఖర్



'రాయల్ సెల్యూట్'లో ఓ దృశ్యం

దాయాది దేశాలైన భారత్, పాకిస్థాన్ మధ్య ఐక్యతను చాటి చెప్పేలా మగిళ్ మూవీ మేకర్స్ పతాకంపై శివ గణేష్ 'రాయల్ సెల్యూట్' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే జై శివ శేఖర్ సమకూర్చడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య కొన్ని దశాబ్దాలుగా వైరం కొనసాగుతోంది. ఇరు దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొని వుంది. కార్గిల్ యుద్ధం కూడా జరిగింది. ఇటీవల పహల్గాంలో ఉగ్రదాడి కూడా జరిగింది. దానికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న ఈ రెండు దేశాల మధ్య ఐక్యత, స్నేహ సంబంధాలు నెలకొనాలని చాటి చెప్పేలా మంచి సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. నిజాయితీగల భారతీయ సైనికుడి కథ. వీరన్ శక్తివేల్ అనే భారతీయ జవాను సరిహద్దుల్లో చిక్కుకుంటాడు. అతడిని ఫక్రూ అనే పాక్ సైనికుడు రక్షిస్తాడు. అయితే, ఓ సందర్భంలో ఫక్రూ భారత జవాన్ల చేతికి చిక్కగా, అతన్ని కాల్చి వేయాలని వీరన్ శక్తివేల్‌ను పై అధికారి ఆదేశిస్తాడు. అయితే, శక్తివేల్ ఆ పని చేయకుండా తనను తాను కాల్చుకుంటాడు. తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ అని తెలిపారు. కాగా, ఈ చిత్రంలో ప్రదీప్ యువరాజ్, సుభాష్ శింబు, జనని తదితరులు ముఖ్యపాత్రలను పోషించారు.

చిత్రజ్యోతి

అజిత్ తేజ్ - శ్వేత జంటగా 'అంద 7 నాడ్గల్'



యువ నటీనటులు అజిత్ తేజ్, శ్వేత జంటగా 'అంద 7 నాడ్గల్' పేరుతో ఓ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. లవ్ థ్రిల్లర్ మూవీగా రూపొందే ఈ చిత్రంలో భాగ్యరాజ్, నమో నారాయణన్, సుభాషిణి కన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటించారు. ఎం.సుందర్ దర్శకత్వం వహించగా, బెస్ట్‌కాస్ట్ స్టూడియోస్ పతాకంపై మురళి ప్రీదాస్ నిర్మించారు. ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ, ' కథ వినగానే గతంలో సీనియర్ దర్శకనటుడు కె.భాగ్యరాజ్ దర్శకత్వం వహించిన నటించిన 'అంద 7 నాడ్గల్' టైటిల్ అయితే సరిపోతుందని భావించి, ఆ చిత్ర నిర్మాణ సంస్థను సంప్రదించగా, వారు అనుమతివ్వడంతో ఆ టైటిల్‌ను ఖరారు చేసాం. చెన్నై, కొడైక్కెనాల్‌లో 45 రోజుల పాటు చిత్రీకరించాం. చిత్ర నిర్మాణం త్వరగా పూర్తి విడుదల చేస్తాం' అని వివరించారు.

యానిమేషన్ దృశ్యకావ్యంగా

'మహావతార్ నరసింహ'



'మహవతార్ నరసింహ'లో ఓ దృశ్యం

'కేజీఎఫ్', 'కాంతారా' వంటి భారీ హిట్ చిత్రాలను నిర్మించిన హోంబలే సంస్థ... క్లీమ్ ప్రొడక్షన్స్ సహకారంతో తెరకెక్కించిన యానిమేషన్ చిత్రం 'మహవతార్ నరసింహ'. మహావతరార్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన తొలి చిత్రం.శుక్రవారం పలు భాషల్లో విడుదలైంది. యానిమేటెడ్ విజువల్స్‌గా ఎంతో గ్రాండ్‌గా తెరకెక్కించారు. అందరికీ తెలిసిన కథే అయినప్పటికీ.. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే పురాణ గాథలను సరికొత్త సాంకేతిక సహాయంతో తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. యానిమేషన్ మూవీ కావడంతో పాత్రలతోనూ, ఆ భావోద్వేగాలతోనూ మరింత కనెక్ట్ అయ్యేలా దృష్టిసారించారు. వారాహవతారం, భూదేవిని చూపించిన తీరు, ప్రహ్లాదుడిని ఏనుగులతో తొక్కి చంపించేందుకు చేసే ప్రయత్నాలు, హోలిక ఎపిసోడ్, నరసింహాతారంతో కూడిన పతాక సన్నివేశాలు ఈ సినిమాకు హైలెట్‌గా నిలిచాయని ఈ సినిమాను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ఆయా సన్నివేశాల్లో విజువల్ గ్రాండ్‌నెస్ ఆకట్టుకుంటుందని, సాంకేతిక విభాగాల్లో సంగీతం మరో ఎత్తయితే, శ్యామ్ సీఎస్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రాణం పోసిందని వారంటున్నారు. అశ్విన్ కుమార్ స్క్రీన్‌ప్లే రచన, దర్శకత్వం మెప్పించేలా ఉందని, తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా చెప్పారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. నిర్మాణంగా ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు చిన్నారులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళే చిత్రంగా రూపొందించారని అంటున్నారు.

ఈ కష్టం పగోడికి కూడా రాకూడదు

● నటుడు పొన్నాంబళం



చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన కష్టం పగవాడికి కూడా రాకూడదని తమిళ సినీ నటుడు పొన్నాంబళం వ్యాఖ్యానించారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో గత కొంత కాలగా డయాలసిస్ చేయించుకుంటూ అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పై విధంగా వ్యాఖ్యానిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. 'డయాలసిస్ జరిగే సమయంలో నాకు రెండు సార్లు సూదులతో రక్తం తీసి, ఆ తర్వాత డయాలసిస్ చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 750 మార్లు సూదులు వేయించుకున్నాను. గత నాలుగేళ్ళుగా ఈ తంతు జరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన శిక్ష ఏదంటే డయాలసిస్ మాత్రమే. ఇలాంటి కష్టం మన పగవాడికి కూడా రాకూడదు. మద్యానికి బానిస కావడం వల్లే ఈ పరిస్థితి అని వైద్యులు అంటున్నారు. కానీ, అలా అలవాటు కావడానికి మరో కారణం ఉంది. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకునేందుకు ఎంతగానో కష్టపడ్డాను. నాకు పునర్జన్మనిచ్చింది మాత్రం మెగాస్టార్ చిరంజీవి. ఆయనే నాకు భారీగా సాయం చేశారు. అలాగే, ఇతర నటీనటుల చల్లని చూపు, సాయం కారణంగా ఇపుడు బాగానే ఉన్నాను. ఈ పరిస్థితుల్లో నేను ఎవరినీ కష్టపెట్టదల్చుకోలేదు. ఒక సహాయకుడి కలిసి ఓ ఇంట్లో జీవిస్తున్నాను. అనేక మంది ఆర్థిక సాయం చేసి ప్రాణభిక్ష పెట్టారు' అని పొన్నాంబళం పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి సేవలో నిరోషా


శ్రీవారి ఆలయం వద్ద నిరోషా

తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. ఇంకా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు హోంమంత్రి అనిత శ్రీకాళహస్తీశ్వరుడిని, పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. నిరోషా పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


కొళత్తూర్ పేపర్‌మిల్స్ రోడ్డులో రూ.42 కోట్లతో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ప్రజల సేవా కేంద్రం తదితర కార్యాలయాల భవన నిర్మాణాలను శనివారం పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, సీఎండీఏ అధికారులు



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.4.23 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,576
తలనీలాలు సమర్పించినవారు: 25,227





సాగులో ‘డ్రోనాస్త్రం’

- అన్నదాతకు అన్నింటా వెన్నుదన్నుగా డ్రోన్
- 80శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయంలో ఇప్పుడీ పరికరానిదే కీలకపాత్ర

వ్యవసాయంపై అన్నదాత పెదవి విరుస్తున్న క్రమంలో ఆధునిక సాంకేతికత ఓ తీయని కబురందించింది. ఎగిరే ఓ అద్భుత యంత్ర పరికరాన్ని రూపొందించి అండగా నిలిచింది. దీన్ని అందిపుచ్చుకుంటే సాగులో లాభాలు పొందవచ్చునని భరోసా ఇచ్చింది. కూలీలు దొరకలేదని, ఖర్చు పెరుగుతోందని డీలా పడుతున్న రైతులకు డ్రోన్ రూపంలో చేదోడువాదోడుగా ఉంటోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి


డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న రైతు

డ్రోన్ల ప్రవేశంతో వ్యవసాయం తీరు మారింది. నైరాశ్యంలో కొట్టుమిట్టాడే రైతన్నలకు ఇది కొండంత అండగా నిలిచింది. సాగులో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు చక్కని పరిష్కారం చూపుతోంది. పదిమంది కూలీలు చేసే పనిని తానొక్కటే చేసి చూపిస్తూ అన్నదాతకు ఆసరా అవుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ రంగాన్ని ఊపందించేందుకు డ్రోన్లను ప్రభుత్వం కారుచౌకగా అందిస్తోంది. రైతులు కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో సఫలీకృతమవుతున్నారు.



ఆగస్టు నుంచి మరిన్ని డ్రోన్లు

జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.52 కోట్లు వెచ్చించి 36డ్రోన్లను పంపిణీ చేసింది. సబ్సిడీ కింద రూ.2.82కోట్లు చెల్లించింది. డ్రోన్ల వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చింది. డ్రోన్లపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు నుంచి మరిన్ని కేటాయించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాశాఖాధికారి


డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సమయం ఆదా అవుతోంది

ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్లను అందజేస్తుండటం శుభపరిణామం. నాకు 20 ఎకరాల పొలముంది. గతంలో ఎకరాకు 200లీటర్ల నీరు నింపి పవర్‌స్ప్రే ద్వారా రెండు గంటల పాటు మందు పిచికారీ చేయాల్సి వచ్చేది. డ్రోన్ ద్వారా ఎకరాకు 10 లీటర్ల పురుగుల మందును 8 నిమిషాల్లోనే స్ప్రే చేస్తున్నాం. సమయం ఆదాతో పాటు కూలీల కొరత కూడా తీరింది.

- మస్తాన్ బిలాల్, రైతు, కల్లూరు గ్రామం, డీవీసత్రం



సాగు ఖర్చు తగ్గింది

నాకు 60 ఎకరాల పొలం ఉంది. సంవత్సరంలో రెండుసార్లు పంట పండిస్తాం.డ్రోన్ సాయంతో సమయం ఆదా ఆవుతోంది. ఖర్చు కూడా తగ్గుతోంది. కొన్ని దీర్ఘకాలిక తెగుళ్లకు డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ చేయడంతో దిగుబడి పెరిగింది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- చంద్రశేఖర్, రైతు, సత్యవేడు



అధిక దిగుబడి సాధిస్తున్నాం

మాకు 16 ఎకరాల పొలం ఉంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు ఐదెకరాల్లో పురుగుల మందు పిచికారీ చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో మాకు డ్రోన్లు ఇవ్వడంతో తక్కువ సయయంలోనే పిచికారీ చేస్తున్నాం. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల ప్రతి ఆకుపై నేరుగా మందు పడుతోంది. దీంతో అధిక దిగుబడి సాధిస్తున్నాం.

- ప్రేమ్‌కుమార్, రైతు, చిన్నకనపర్తి, తొట్టంబేడు మండలం.


సబ్సిడీ కింద రైతులకు డ్రోన్లు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

పిచికారీలో ప్రధాన పాత్ర

జిల్లాలో ప్రతి మండలానికీ 80శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లు మంజూరు చేసింది. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో వీటిని ఇప్పటికే అందజేసింది. మారుమూల గ్రామీణ ప్రాంత రైతులు సైతం ఇప్పుడు డ్రోన్ల సాయంతో సాగులో చకచకా దూసుకుపోతున్నారు. సమయం ఆదాతోపాటు పెట్టుబడీ తగ్గుతుండటంతో డ్రోన్ల వ్యవస్థపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

డ్రోన్ కావాలంటే ఇలా చేయాలి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నీరుగారింది. మందు పిచికారీ చేయాలంటే డ్రోన్‌ను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రోన్ల వ్యవస్థను బలోపేతం చేయాలని సంకల్పించింది. కనీసం ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడితే చాలు. పదవ తరగతి లేదా ఐటీఐ చదివి డీజీసీఏ నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు ఉండాలి. గ్రూప్‌లోని ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై 12రోజుల పాటు గుంటూరులో శిక్షణ ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలు. ఇందులో రైతుల సంఘం రూ.2లక్షలు చెల్లిస్తే మిగతా రూ.7.84 లక్షలు బ్యాంకు రుణంగా సమకూర్చుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం 80శాతం రాయితీ కింద 7.84లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది.


వరి, మామిడిపై మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రెండు రోజుల భారీ వర్షసూచన

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... మహారాష్ట్ర-కేరళ సముద్రతీరంలో నెలకొన్న అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందన్నారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అలాగే, నీలగిరి, కోవై జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

కిడ్నీ రాకెట్‌పై విచారణకు కమిషన్

- మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ రాకెట్ వ్యవహారంలో దర్యాప్తు చేపట్టేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి వినీత్ నేతృత్వంలో ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎగ్మూరులోని మహిళా ప్రసూతి ఆస్పత్రిలో నిర్మాణంలో ఉన్న పేరెంట్స్ హాస్టల్ భవనాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 2022లో కరుణ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మారథాన్ రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా రూ.1.25 కోట్లు రాగా, ప్రభుత్వం మరికొంత మత్తం జోడించి రూ.5.89కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. 2023లో నిర్వహించిన మారథాన్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.3.42 కోట్లు రాగా, మరికొంత ప్రభుత్వ సాయం కలిపి రాయపేట జనరల్ ఆస్పత్రిలో రూ.10.27 కోట్లతో క్యాన్సర్ చికిత్సా విభాగం కోసం భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. కాగా నామక్కల్ జిల్లాలో కిడ్నీ రాకెట్‌పై వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ...అన్నాడీఎంకే పాలనా కాలంలో ఇలాంటి ఘటనలు జరిగాయని, కానీ అప్పట్లో ఆ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకే దర్యాప్తు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టిందన్నారు. నేరం నిరూపణ అయితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఐఏఎస్ అధికారి వినీత్ నేతృత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ బృందం నిశితంగా దర్యాప్తు చేస్తోందన్నారు. అవయవదానం విషయంలో కేవలం మానవతాకోణం మాత్రమే ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి నగదు లావాదేవీలు ఉండకూడదని మంత్రి వ్యాఖ్యానించారు.


భవనాలను పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ట్రాక్టర్ బోల్తా : ముగ్గురు మహిళల మృతి

పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మహిళలు మృతిచెందగా, మరో 8 మందికి గాయాలయ్యాయి. రామనాథపురం జిల్లా కడలాడి తాలూకా కూవర్‌కూట్టం గ్రామానికి చెందిన 15 మంది శుక్రవారం రేషన్ దుకాణం నుంచి సరుకులు తీసుకుని ట్రాక్టర్‌లో బయల్దేరారు. వెట్రిమలై కాలువ గట్టు మీదుగా వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో పొన్నమ్మాళ్ (68), రాకీ (62), మునియమ్మాళ్ (55) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. చుట్టుపక్కల ఉన్న వారు వెంటనే వెళ్లి తీవ్రగాయాలతో ఉన్న 8 మందిని రక్షించి 108 అంబులెన్స్‌లో రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం దిగ్ర్భాంతి..

రామనాథపురం జిల్లాలో ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు మహిళలు మృతిచెందిన ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకనలో.. ముగ్గురు మహిళలు మృతిచెందిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తలా రూ.3 లక్షలు ఆర్థికసాయం ప్రకటించారు. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతునన్న వారికి తలా రూ.50 వేలతో పాటు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, అధికారులను ఆదేశించినట్లు సీఎం తెలిపారు.

రూ.400 కోట్లకు ‘ఇరీడియం’ విక్రయం...?

- నలుగురి అరెస్ట్


పెరంబూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇరీడియం స్వాధీనం చేసుకున్న పోలీసులు, అది నాణ్యమైనదా? నకిలీదా? అంటూ విచారణ చేపట్టారు. కడలూరు జిల్లా నైవేలిలో కొందరు ఇరీడియం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు ఆ ప్రాంతానికి మారువేషాల్లో వెళ్లి, ఇరీడియం కొనుగోలు చేస్తామంటూ చెప్పారు. మారేవేషాల్లో వచ్చింది పోలీసులు అని తెలియని ఆ ముఠా, రూ.400 కోట్లకు ఇరీడియం విక్రయిస్తామని తెలిపింది. దీంతో, పోలీసులు ఆ ముఠాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేసి, ఇరిడీయం స్వాధీనం చేసుకుని, ఇది నాణ్యమైనదా? నకిలీదా? అని తెలుసుకునేందుకు పరీక్షలకు పంపారు.


హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

వెంకన్న దయతలిస్తే టాప్‌లో కూర్చుంటా!

‘కింగ్‌డమ్’ వేడుకలో హీరో విజయ్ దేవరకొండ

తిరుపతి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏడుకొండలస్వామి నా పక్కన వుండి నడిపిస్తే పోయి టాప్‌లో కూర్చుంటానని యువ హీరో విజయ్ దేవరకొండ అన్నారు.ఆయన హీరోగా నటించిన ‘కింగ్‌డమ్’ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం శనివారం రాత్రి తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ప్రతిసారిలాగే ఈ సినిమాకు కూడా ప్రాణంపెట్టి గట్టిగా పనిచేశాం. ఇక మిగిలింది ఆ వెంకన్నస్వామి దయ, మీ అందరి ఆశీస్సులు.ఈ రెండూ నా వెంటవుంటే నన్ను ఎవరూ ఆపలేరు.సినిమా విడుదల రోజైన 31న థియేటర్‌లో మిమ్మల్ని మళ్లీ కలుస్తా, అప్పటి వరకు బాగా చూసుకో స్వామీ, ఏడుకొండలవాడా గోవిందా గోవిందా’ అని చిత్తూరు యాసలో మాట్లాడుతూ యువతను ఆకట్టుకున్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ ‘తిరుపతి నాకు చాలా స్పెషల్, ఇక్కడికి వస్తేనే పాజిటివ్ ఫీలింగ్ వస్తుంది, చేసింది ఒక్క సినిమానే అయినా మీరంతా నామీద చూపిస్తున్న ప్రేమ మరువలేను’ అన్నారు. చక్కటి టీం వర్కుతో పనిచేశామని, కింగ్‌డం సినిమా ఆద్యంతం అలరిస్తుందని చెప్పుకొచ్చారు.క్లాస్, మాస్ వాతావరణంలో జరిగిన ట్రైలర్ రిలీజ్ మధురానుభూతినిచ్చిందన్నారు.అంతకు ముందు మూవీ ట్రైలర్ రిలీజ్ చేయగానే కుర్రకారు లేచినిలబడి కేరింతలు కొడుతూ సందడి చేశారు.యువత ఉత్సాహం మితిమీరడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపుచేశారు.దర్శకుడు గౌతమ్‌తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు. కాగా గతంలో గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హీరో విజయ్ దేవరకొండను అరెస్టు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రతినిధులు మైదానం వెలుపల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.


హీరో విజయ్ దేవరకొండ

శ్రీసిటీలో తైవాన్ వ్యాపార ప్రతినిధుల బృందం

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్‌కి చెందిన 14మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాక్స్‌లిన్ నేతృత్వంలో విచ్చేసిన ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ తరపున మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్‌తివారీతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య ముఖ్య కార్యదర్శి డాక్టర్ యువరాజ్ వర్చువల్‌గా తైవాన్ బృందంతో చర్చించారు.



ముక్కంటి క్షేత్రం... భక్త జన సంద్రం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 511 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,304, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,447మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,696 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,092, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 325, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,800 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.